నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | ఆదివారం 29 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



సీఆర్టీల దీక్షకు మద్దతు తెలిపి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉట్నూర్, డిసెంబర్28 : సీఆర్టీలకు ఉద్యోగ భ ద్రత కల్పించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు సీఆర్టీల చేపట్టిన రిలే దీక్షలు 13వ రోజుకు చేరుకోగా, వారు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ సీఆర్టీలు దీక్షలు చేస్తున్నా సర్కారు స్పందించడం లేదని, తరగతులు సాగక విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. సీఆర్టీలు పట్టణంలో ర్యాలీ తీసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, పెందూర్ పుష్పారాణి, రాజేశ్ పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న సఫాయి కార్మికులు

# సఫాయి కార్మికుల ధర్నా

నస్పూర్, డిసెంబర్ 28 : సమస్యలు పరిష్కరించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సఫాయి కార్మికులు ధర్నా చేశారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. సీఐటీయూ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మల్టీ పర్పస్ విధానం ద్వారా కార్మికులపై పనిభారం మోపుతున్నారని చెప్పారు. ప్రతి నెలా వేతనాలు రావడం లేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు లక్ష్మణ్, రాయలింగు, చిన్నయ్య, సాగర్, రాజలింగు, సుధాకర్,బానయ్య, బాపు, రవి, దుర్గ, లక్ష్మి, యశోధ, మంగ, లత పాల్గొన్నారు.



రెబ్బెన ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

# జీపీ కార్మికుల రాస్తారోకో

రెబ్బెన, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన టోకెన్ సమ్మె శనివారం రెండో రోజూ కొనసాగింది. కార్మికులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో నంబర్ 60ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, శంకర్, దేవాజీ, ప్రవీణ్, శంకర్, శ్రీనివాస్, కొండు లక్ష్మి, రాజమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, పద్మ, ప్రకాశ్, ధర్మయ్య, సంతోశ్, అన్నాజీ, భాస్కర్, సదాశివ్, మహేందర్ ఉన్నారు.



చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

- రైతుల డిమాండ్
- చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా
- అధికారులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : కిష్టంపేట గ్రామ సమీపంలోని ఆదిశంకరాచార్య మిల్లులో పత్తి గొనుగోళ్లు చేపట్టాలని రైతులు చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మిల్లులో రెండు రోజులుగా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని, ఇదేమని అడిగితే పరిమితికి మించి కొనేది లేదంటున్నారని, ప్రైవేట్‌లో అమ్ముకోవాలని మిల్లు నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని రైతులు మండిపడ్డారు. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 7520 ఉండగా, ప్రైవేట్‌లో రూ. 6500 నుంచి ఉందని, వ్యాపారులకు అమ్ముకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ అధికారులు, ప్రైవేట్ దళారులు కుమ్మక్కై తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఆందోళనలు చేస్తున్నా ఎమ్మెల్యే వివేక్‌గాని, ఏ ఇతర ప్రజాప్రతినిధులుగాని స్పందించడం లేదని పేర్కొన్నారు. రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి.. రోడ్డుపై పడుకొని ఆందోళన చేయడంతో సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నూర్ ఎస్ఐ సుబ్బారావు, మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులు అక్కడికి చేరుకొని సీపీవో, రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

# ఓపెన్ ప్రవేశాలకు 30వరకు గడువు

బెల్లంపల్లి, డిసెంబర్ 28: ఓపెన్ టెన్త్, ఇంటర్ (2024–25)లో ప్రత్యేక ప్రవేశాల కోసం తత్కాల్ ద్వారా ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని బజార్ ఏరియా ఉన్నత పాఠశాల సహాయ సమన్వయకర్త సంగర్ష్ వెంకటేశ్వర్‌రావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఇదే చివరి అవకాశమని, ప్రవేశం పొందే అభ్యాసకులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం నంబర్‌ను (9912275901) సంప్రదించాలని వెల్లడించారు.

# మెరుగైన సేవలందించాలి : ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 28 : ప్రజలతో మర్యాదపూర్వకంగా ఉంటూ మెరుగైన సేవలందించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్‌తో కలిసి నెల వారీ నేర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కేసులు పెండింగ్ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కొత్త సంవత్సర వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.. సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు.. వెనుకాల లాఠీలు పట్టుకొని కాపలాకాస్తున్న పోలీసులు

# సర్కారుపై సమరం

## ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ ఆయా వర్గాల ఆందోళన

- నిత్యం నిరసనలతో హోరెత్తుతున్న కలెక్టరేట్
- 19వ రోజుకు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె
- సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల ధర్నా
- గోడు వినేవారు.. గోస తీర్చే వారు లేరని ఆవేదన

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆయా వర్గాలు సర్కారుపై సమర శంఖం పూరించాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళనలకు దిగి.. నిరసనలతో హోరెత్తిస్తున్నాయి. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకున్నది. ఉద్యోగులు రోజుకో తీరున నిరసనలు చేపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వీరి సమ్మె కారణంగా చదువులు సాగక, విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇక తాజాగా.. శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. రెబ్బెన మండల కేంద్రంలోని జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, పీఆర్సీ వర్తింపజేయాలని, జీవో 51ను సవరించాలని, మల్టీపర్పస్ వర్క్ విధానాన్ని రద్దుచేయాలని, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చాలని, ఆన్‌లైన్‌ల ద్వారా నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని, అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జేఏసీ నాయకులు, కార్మికులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, దేవాజీ, శంకర్, ప్రవీణ్, శంకర్, శ్రీనివాస్, కొండ లక్ష్మి, రాజమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, ప్రకాశ్, ధర్మయ్య, సంతోశ్, అన్నాజీ, భాస్కర్, సదాశివ్, మహేందర్ పాల్గొన్నారు.

### గోడు వినేవారు.. గోస తీర్చే వారు లేరంటూ ఆవేదన

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులతో పాటు గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళనలు చేపడుతున్నా కనీసం వారి గోడు వినేవారు కరువయ్యారు. దాదాపు నెల రోజులుగా ఏదో ఒక వర్గం ధర్నాలు చేపడుతుండగా, గోస తీర్చేవారు లేరన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కలెక్టరేట్‌లోనికి వెళ్లకుండా నిత్యం పదుల సంఖ్యలో పోలీసులు మాత్రం కాపలాగా ఉంటున్నారు.



కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు



రెబ్బెన మండల కేంద్రంలో రాస్తారోకోచేస్తున్న పంచాయతీ కార్మికులు

# ఎట్టకేలకు మున్సిపల్ సమావేశం

- ఈ నెల 30న నిర్వహణకు నిర్ణయం
- వచ్చే నెలలో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం

మంచిర్యాల టౌన్, డిసెంబర్ 28 : మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సెప్టెంబర్ 30న చివరి సమావేశం నిర్వహించిన పాలకవర్గం, అక్టోబర్‌లో ఆ ఊసే ఎత్తలేదు. నవంబర్‌లో సైతం మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించలేదు. ఇక చివరకు ఈ నెల 30న సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతినెలా ఠంచనుగా నిర్వహించాల్సిన ఈ సమావేశాలను ఎందుకు మూడు నెలల పాటు ఏర్పాటు చేయలేదన్న అంశంపై పాలక, అధికార వర్గాల్లో ఎవరూ నోరుమెదపని పరిస్థితి నెలకొంది. ఇక జనవరి 27తో ఇప్పుడున్న మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్నది. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య తిరుపతి వెళ్లి తిరిగి వచ్చాక జనవరి 2న మున్సిపల్ సమావేశం నిర్వహించాలని అనుకోగా, ఈ నెల 30 తేదీలోగా నిర్వహించకుంటే కౌన్సిల్ రద్దు చేయాల్సి ఉంటుందని ప్రచారం జరిగిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని వైస్‌చైర్మన్ సల్ల మహేశ్ అధ్యక్షతన నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా, శనివారం చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ మహేశ్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు సమావేశమయ్యారు. సమావేశం నిర్వహణ, ఎజెండాలోని అంశాలపై అనుసరించాల్సిన తీరుపై చర్చించారు. పదవీకాలం ముగియనున్న చివరి నెలల్లో కౌన్సిలర్లు తాము అభివృద్ధి చేశామని చెప్పుకోవడానికైనా వార్డుల్లో పలు రకాల పనులకు అనుమతులు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ సమావేశాలు నిర్వహించని కారణంగా వారికి ఈ అవకాశం కూడా లేకుండా పోయింది. ఇపుడున్న పాలకవర్గం తమ ఐదేళ్ల పదవీ కాలాన్ని సంతృప్తిగా సాగించలేని పరిస్థితులు ఎదురయ్యాయి. రెండేళ్ల పాటు కరోనాతో సాగించారు. మరో ఏడాది ముగియగానే అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, మున్సిపల్ చైర్మన్ మార్పులాంటి అంశాలతో వారి పదవీకాలాన్ని సంతృప్తిగా కొనసాగించలేని పరిస్థితి ఎదురయ్యింది. అసలు మున్సిపల్ సమావేశాలు ఎందుకు నిర్వహించ లేదో అన్న ప్రశ్నకు ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదు. దీంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు, ఇతరత్రా అవసరమైన పనులకు కౌన్సిల్‌లో చర్చించి, నిర్ణయం తీసుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. దీనికి తోడు కార్యాలయం పరంగా అత్యవసరంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు, మున్సిపల్ వాహనాలు, పైపులైన్లు, విద్యుత్ మోటార్ల మరమ్మతుల బిల్లులు కూడా కౌన్సిల్ ఆమోదం తర్వాత చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ పనులు చేసిన వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలు నిర్వహించని కారణంగా చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు నెలనెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనాలు ఆగిపోయాయి.





మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

# జంగుబాయి జాతరను వైభవంగా జరుపుకోవాలి

కెరమెరి, డిసెంబర్ 28 : ఆదివాసుల ఆరాధ్య దేవత జంగుబాయి జాతరను భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుపుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం హట్టి ఆశ్రమ పాఠశాలలో జనవరి 2వ తేదీ నుంచి నిర్వహించే జంగుబాయి జాతరపై ఉత్సవ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, మహిళలకు 10 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఉమ్రి నుంచి పరందోలి తండా వరకు రోడ్డు మరమ్మతులు చేపిస్తామని, టొప్లకస వద్ద నిర్మించిన వంతెన వద్ద రహదారి మెరుగు పరుస్తామని చెప్పారు. భక్తులు స్నానాలు ఆచారించే టొప్లకస, అక్కడి నుంచి జంగుబాయి ఆలయం వరకు రహదారిలో లైట్లు ఏర్పాటు చేయాలని కమిటీ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా శాశ్వతంగా ఉపయోగపడే వాటర్ ట్యాంక్ నిర్మించాలని, జంగుబాయి ఆలయ ప్రాంగణంలో అక్రమంగా సాగు చేస్తున్న భూమిని స్వాధీనం చేసుకొని ఆలయం పేరిట పట్టా చేసి ఇవ్వాలని కమిటీ నాయకులు వేడుకున్నారు. గతంలో మంజూరైన కమ్యూనిటీ హాల్, షెడ్లను వెంటనే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్, పీవో సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు బాధ్యత అప్పగించారు. అనంతరం కలెక్టర్, పీవో జంగుబాయి జాతరకు సంబంధించిన పోస్టర్లను కమిటీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఏపీవో మెస్రం మనోహర్, డీఎస్పీ కరుణకర్, ఆర్అండ్‌బీ ఈఈ సురేశ్, డీపీవో భిక్షపతి గౌడ్, ఎంపీడీవో అమ్జద్‌పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్‌కుమార్, సీఐ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు మతీన్, రాకేశ్, ఏసీఎంవో ఉద్ధవ్, కమిటీ నాయకులు సలాం శ్యాంరావ్, మరప బాజీరావ్, పుర్క బాపురావ్, ఆత్రం లక్ష్మణ్‌రావ్, రాయిసిడాం జంగు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



జంగుబాయి జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పీవో కమిటీ నాయకులు




చేపల చెరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# చేపల పెంపకంతో అధిక ఆదాయం

## ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వాంకిడి,డిసెంబర్ 28 : చేపల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం సరాండి గ్రామంలో చేపల పెంపకం కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న చెరువులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజన రైతులు సుమారు15 ఎకరాల్లో చేపల చెరువులను నిర్మించుకున్నారని, వాటిలో అధిక లాభాలు వచ్చే చేపల రకాలను పెంచాలని సూచించారు. చేపల పెంపకంపై అధికారులు సూచనలు,సలహాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు,వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగార్స్‌తో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- రౌడీ షీటర్స్, ట్రబుల్ మాంగార్స్‌కు కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 28 : ఈ నెల 31న రాత్రి.. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. శనివారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్స్, ట్రబుల్ మాంగార్స్‌కు ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ వేడుకల వేళ మద్యం సేవించి వేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాష్‌డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం, దాడులకు, బెదిరింపులకు పాల్పడడంవంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోమంచిర్యాల పట్టణ సీఐ ప్రమోదరావు, మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.